క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

నాగర్‌కర్నూల్ రూరల్: మండల పరిధిలోని దేశిటిక్యాలలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రాష్ట్ర నాయకులు జెట్టి ధర్మరాజు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ విద్యనభ్యసించి అంబేడ్కర్‌గా ఎదగాలని పిలుపునిచ్చారు. నాగరాజు, ఎల్లయ్య, పరమేశ్, బాలస్వామి, శ్రీను, హరికృష్ణ, కళాకారుల బృందం, ఉదయ్, రాంచందర్ పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డు అందజేత

నాగర్‌కర్నూల్ రూరల్: లేబర్ యూనియన్ జిల్లా నాయకుడు జి.ఆంజనేయులు ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా సోమవారం శ్రమశక్తి అవార్డు అందుకున్నట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆశీస్సులతో తనకు ఈ అవార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు.

వేసవి తరగతులు వినియోగించుకోండి

లింగాల: వేసవిలో సమయాన్ని వృథా చేసుకోకుండా క్రీడలకు సంబంధించి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో వైస్‌చైర్మన్ వెంకటగిరి విద్యార్థులను కోరారు. జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి అథ్లెటిక్స్ శిక్షణ శిబిరాన్ని సోమవారం వైస్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నెల రోజుల పాటు కొనసాగే శిబిరంలో అథ్లెటిక్స్ విభాగంలోని వివిధ రకాల క్రీడలను నేర్చుకోవాలని సూచించారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకే శిక్షణ ఉంటుందని కోచ్ అబ్దుల్లా తెలిపారు. క్రీడల సమయంలో మైదానం చదును గురించి వైస్ చైర్మన్ నిర్వాహకులకు రూ.1,000 అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోనేటి తిర్పతయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

తైక్వాండో శిక్షణ శిబిరం ప్రారంభం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్ బాయ్స్ హైస్కూల్‌లో సోమవారం ఉచిత తైక్వాండో శిక్షణ కేంద్రాన్ని జిల్లా యువజన క్రీడా శాఖా ఆధ్వర్యంలో పెంట్లవెల్లి మండల యువతి, యువకులు శిక్షణ పొందాలని కోచ్ రామకృష్ణ శిక్షణ ప్రారంభించారు. ముఖ్యంగా ఈ శిక్షణ శిబిరం యువతి, యువకులకు ఉపయోగపడేలా తైక్వాండో, కరాటే, షటిల్‌బ్యాట్‌మెన్ పలు రకాల ఆటలను ఈ శిబిరంలో నేర్పిస్తామన్నారు. మే 1 నుంచి 31 వరకు తరగతులు కొనసాగుతాయని, ఆసక్తి ఉన్నవారు శిక్షణ పొందవచ్చని తెలియజేశారు.

కంప్యూటర్ తరగతులు..

పెద్దకొత్తపల్లి: కల్వకోల్‌లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమాన్ని సోమవారం సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు కంప్యూటర్ శిక్షణతో పాటు వేసవిలో స్పోకెన్ ఇంగ్లీష్‌పై పట్టు సాధిస్తే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని సూచించారు. పుల్లయ్యశెట్టి, సత్యనారాయణ, రాముడు, శ్రీకృష్ణ, రవి, లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌కు సన్మానం

కల్వకుర్తి రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం సన్మానించారు. ప్రైవేట్ కాంట్రాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో చైర్మన్‌ను శాలువాతో సత్కరించారు. నాయకులు మురళీ, అశోక్ చారీ పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామికి కలశ అభిషేకాలు



బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని అప్పాజిపల్లి లక్ష్మీనర్సింహస్వామికి ఆలయ అర్చకులు సోమవారం కలశ అభిషేకాలు కనుల పండువగా నిర్వహించారు. మహాలక్ష్మి అండాళ్‌వారు, ఆంజనేయస్వామి, గరుత్మంత, ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం గణపతి పూజ, గోపూజ, శ్రీసూక్త పారాయణం, సూర్య నమస్కారాలు నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన, పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి నుంచి ఉత్సవాలు

వెల్దండ: మండల పరిధిలోని బైరాపూర్‌లో మంగళవారం నుంచి 6వ తేదీ వరకు లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థప్రసాదలను స్వీకరించాలని ఉత్సవ కమిటీ పేర్కొన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించండి

లింగాల: మండలంలో భారీగా పేరుకుపోయిన విద్యుత్తు బకాయిలను వెంటనే చెల్లించాలని ట్రాన్స్‌కో ఏఈ అప్పలనాయుడు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో రూ.కోటి వరకు బకాయిలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా గృహ వినియోగాలకు సంబంధించి బిల్లులు రూ.47.56 లక్షలు రావాల్సి ఉందన్నారు.

కార్మికులు ఐక్యంగా పోరాడాలి

నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్‌లో సోమవారం మేడేను కార్మికులు ఘనంగా నిర్వహించారు.

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై కార్మికులు ఐక్యంగా పోరాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దేశ్యానాయక్ పిలుపునిచ్చారు. అచ్చంపేటలో సీపీఎం, సీపీఐ, ఏఐఎస్‌ఎఫ్, వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో కార్మికులతో కలిసి మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కౌన్సిలర్లు, కమిషనర్ సహపంక్తి భోజనం చేశారు. ఆయా పార్టీల, కార్మిక సంఘాల జెండాలను ఆవిష్కరించారు.
- నాగర్‌కర్నూల్ బస్టాండ్ సర్కిల్‌లో సీఐటీయూ, సీపీఎం, ఏఐటీయూసీ, సీపీఐ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్ర జెండాలను ఆవిష్కరించారు.
- కొల్లాపూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. శ్రీవాణి విద్యానిలయంలో ఇందిరాగాంధీ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు రంగినేని జగదీశ్వరుడు కార్మికులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.
- శ్రమజీవులు హక్కులను కాలరాస్తే ఉద్యమిస్తామని సీపీఐ రాష్ట్ర నాయకులు వార్ల వెంకటయ్య, జిల్లా నాయకులు చిల్వేరు శ్రీనివాసులు అన్నారు. మేడే దినోత్సవం సందర్భంగా చారకొండ మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు.
- వెల్దండ మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో సోమవారం 1104 యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ జెండాను ఆవిష్కరించారు.

– 'సాక్షి' నెట్‌వర్క్



నాగర్‌కర్నూల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్ ఆనంద్‌జీ



అచ్చంపేట మున్సిపల్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నాయకులు



గుంతకోడూరులో మాట్లాడుతున్న వెంకటయ్య



బిజినేపల్లి మండల కేంద్రంలో..



తెలకపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో..



ఉప్పునుంతలలో..



దోమలపెంటలో..



కొల్లాపూర్‌లో మేడే వేడుకల్లో సీపీఐ నాయకులు



పెద్దకొత్తపల్లిలో..



కోడేరులో



కల్వకుర్తిలో..



వెల్దండలో మేడే సందర్భంగా జెండాను ఆవిష్కరిస్తున్న 1104 యూనియన్ నాయకులు



చారకొండలో..



పెంట్లవెల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న జెడ్పీచైర్మన్ శాంతాకుమారి

కల్వకుర్తి: రాష్ట్ర నూతన సచివాలయానికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడంతో పాటు దళితబంధు పథకం ఫైల్‌పై సంతకం చేయడాన్ని హర్షిస్తూ సీఎం చిత్రపటానికి జెడ్పీచైర్మన్ శాంతాకుమారీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ దళితుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని చెప్పడంతో పాటు ఆర్థికంగా దళితులను బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన దళితబంధు పథకం ఫైల్‌పై నూతన సచివాలయంలో మొదటి సంతకం చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, హరిదాసు, రాజు, చిన్న, బంగారీ, పరశురాములు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బడుగుల అభివృద్ధి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న బీఎస్పీ నాయకులు

తాడూరు: బీఎస్పీతోనే సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని బీఎస్పీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. సోమవారం తెలంగాణ భరోసా సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అమరుల త్యాగం, ఆత్మబలిదానాలతో వచ్చిన తెలంగాణ ప్రస్తుతం గోశిస్తుందని విమర్శించారు. ఈ నెల 7న నిర్వహించే తెలంగాణ భరోసా సభకు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బీఎస్పీ నాయకులు దేవదాసు, పృథ్వీరాజు, మహేష్, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

తెలకపల్లి: ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గౌరెడ్డిపల్లిని సందర్శించారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ఆమె డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసే విధానాన్ని పరిశీలించారు. నర్సరీలోని మొక్కలను పరిశీలించి, ప్రతి మొక్కను ఆరోగ్యంగా పెంచాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన కల్పించి, వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ భాస్కర్, ఎంపీఓ కస్తూరి వెంకట్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది రాములు పాల్గొన్నారు.

మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మొక్కలను పరిశీలిస్తున్న రోహిత్ గోపిడి

కోడేరు: మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి అన్నారు. సోమవారం కోడేరు మండల పరిధిలోని నర్సాయిపల్లిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో పెంచుతున్న మొక్కలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నర్సాయిపల్లిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో 13,330 మొక్కలు ఉన్నాయని నాటిన మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కూలీలతో నీరు పోయించాలన్నారు. తప్పని సరిగా మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ శరత్‌చంద్రారెడ్డి, బీఆర్‌ఓ పద్మారావు, బీట్ ఆఫీసర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సర్వసభ్య సమావేశం

కోడేరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొండ వెంకటరాధ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఏఓ శ్రీరాం మాట్లాడారు. కురుస్తున్న అకాల వర్షాలకు యాసంగిలో పండించిన వరి పంట కోత కోయకుండా ఉండాలని సూచించారు. కోత కోయడంతో రైతులు పండించిన పంటకు నష్టం జరుగుతుందని, వర్షాలు ఆగిన తర్వాత పంటలను కోయాలని సూచించారు. తప్పని సరిగా రైతులు సీజన్‌లో భూసార పరీక్షలు చేయించుకుని అధిక దిగుబడులు పొందాలన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ మాట్లాడారు. గొర్రెల కాపరులు గొర్రెలు, మేకలకు, పశువులకు అందుబాటులో టీకాలు ఉన్నాయన్నారు. ఉపాధి హామీ ఏపీఎం మోహన్ మాట్లాడుతూ.. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తామన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు పలు సమస్యలపై వివరించారు. వైస్ ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బీరప్ప ఉత్సవాలు

వెల్దండ: మండల పరిధిలోని రాచూర్‌లో బీరప్ప ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ముగింపు సందర్భంగా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఆచారి వేర్వేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పెద్దకొత్తపల్లి: వెనచర్ల, మర్రికల్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు అకాల వర్షంలో వరిచేలు కోయకుండా వర్షం ముగిసిన తర్వాత కోసుకోవాలని సూచించారు.

కొల్లాపూర్‌లో 66.8 మి.మీ వర్షపాతం నమోదు

కొల్లాపూర్: పట్టణంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. 66.8 మి.మీగా వర్షపాతం నమోదైంది. వర్షం కారణంగా పలు చోట్ల రోడ్లపై నీరు నిలిచింది. వ్యవసాయ మార్కెట్ యార్డులో వరిధాన్యం తడిసిపోయింది.

కంటివెలుగు శిబిరం పరిశీలన



నాగర్‌కర్నూల్ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగులో ప్రజలు కంటిపరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌ఓ డా.సుధాకర్‌లాల్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని శ్రీపురంలో నిర్వహించిన కంటివెలుగు శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా కంటివెలుగులో పరీక్షలు చేయించుకోవాలన్నారు. డా.మహతి, పర్యవేక్షణాధికారి కేశవులు పాల్గొన్నారు.

సీఎంని కలిసిన ఎమ్మెల్యే

కల్వకుర్తి: సీఎం కే చంద్రశేఖర్‌రావును ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సోమవారం కలిశారు. నూతన సచివాలయంలో మహాత్మాగాంధీ ఎత్తిపోతల, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులపై సమావేశం కొనసాగుతున్న సందర్భంగా ఎమ్మెల్యే సీఎంని కలిశారు. కేఎల్‌ఐలో కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి మాడ్గుల మండలం నాగిళ్ల వరకు 60 కిలోమీటర్ల కాల్వ నిర్మాణంతో పాటు వెల్దండ, ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లోని రైతులకు చెల్లించాల్సిన రూ.27 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీఎంని కోరినట్లు ఎమ్మెల్యే చెప్పారు. స్పందించిన సీఎం ఫైనాన్స్ కార్యదర్శి రామకృష్ణారావుకు నిధులు విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

పుస్తకావిష్కరణ

కల్వకుర్తి టౌన్: బంజారా అస్తిత్వాలను వెలికితీస్తూ.. తమ జీవన గమనాన్ని తెలియజేసేలా బంజార మొగ్గలు అనే పుస్తకం ఉందని కల్వకుర్తి మాడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేష్ అన్నారు. సోమవారం కళాశాలలో పనిచేస్తున్న లెక్చరర్ సైదులు రచించిన పుస్తకాన్ని కళాశాల ప్రాంగణంలో పాలెం కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్‌తో కలిసి ఆవిష్కరించారు. పుస్తకావిష్కరణలో చాలా మంది కవులు మాట్లాడారు. ఇలాంటి రచనలు మరిన్ని రావాలని అన్నారు. అనంతరం కార్యక్రమానికి వచ్చిన వారికి పుస్తకాలను అందజేశారు. శ్రీకాంత్, కళాశాల సిబ్బంది, కవులు పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ

కొల్లాపూర్: పట్టణంలో పాలిసెట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సోమవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. రాష్ట్రీయ సమృద్ధి భారతి ట్రస్టు, కేవైఎఫ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 400 మంది విద్యార్థులకు సుధాకర్‌రావు ఉచితంగా పాలిసెట్ కోచింగ్ ఏర్పాటు చేయించారు. వీరికి ఆయన స్టడీ మెటీరియల్‌ను అందించారు. బీజేపీ నాయకులు శేఖర్‌గౌడ్, కడ్తాల కృష్ణ, సత్యనారాయణగౌడ్, కాశీపురం మహేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా ప్రజావాణి



వెల్దండలో ఫిర్యాదు అందిస్తున్న రైతు

లింగాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి నామమాత్రంగా కొనసాగింది. ప్రజల నుంచి వినతుల కోసం అధికారులు ఎదురుచూడాల్సి వచ్చింది. ప్రజావాణిలో ప్రతివారం వచ్చే రెండు, మూడు శాఖల అధికారులు తప్పా ఇతర శాఖల వారు రావడంలేదు. ఎంపీడీఓ గీతాంజలి, డీటీ ముబినాబేగం, ఏఓ నాగార్జునరెడ్డి, సర్వేయర్ రాంబాబు, ఏఆర్‌ఐ తిర్పతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించాలి

వెల్దండ: ప్రజావాణిలో ప్రజలు వివిధ సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడారు. ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. బండోనిపల్లిలో ఆక్రమణకు గురవుతున్న కుంటను సర్వే చేయాలని రైతు శేఖర్, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. మండల ప్రత్యేక అధికారి పత్యానాయక్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఓ మంజుల, శ్రీమతి, తిరుపతినాయక్ ఉన్నారు.

తెలకపల్లి: ఇనాం భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతి అందజేశారు. సోమవారం ప్రజావాణిలో తెలకపల్లి ఈదమ్మ దేవాలయ సమీపంలోని సర్వే నంబర్ 506లో 4 ఎకరాల 27 గుంటల ఇనాం భూమిని కొందరు ఆక్రమించుకుని స్వాధీన పరుచుకుంటున్నారని, అక్రమ కట్టడాలు జరుపుతున్నారని వాటిని ఆపాలని భోగరాజు, పసుపుల వంశీయులు వినతి అందజేశారు.

అధికారుల డుమ్మా

కోడేరు: తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టారు. ప్రజావాణికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభారాణి, మండల వ్యవసాయ అధికారి శ్రీరామ్, విద్యుత్ లైన్‌మెన్ ప్రభాకర్ హాజరయ్యారు, మిగతా దాదాపు ఎనిమిది శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు తెలియజేశారు.

రెండో విడత గొర్రెల పంపిణీపై అవగాహన



తాడూరులో మాట్లాడుతున్న గంగామోహన్

తాడూరు: మండల కేంద్రంలో సోమవారం రెండో విడత గొర్రెల పంపిణీ పథకంలోని లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగామోహన్, పశువైద్యాధికారి డా.రాజేష్‌కుమార్ మాట్లాడారు. గొర్రెల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులందరూ వాటికి సంబంధించిన డాక్యుమెంటేషన్ పూర్తి చేసేందుకు కావాల్సిన ఆధార్, బ్యాంక్ అకౌంట్, కులధ్రువీకరణ పత్రాలతోపాటు నామిని వివరాలను తెలియజేసే వాటిని పశువైద్య కార్యాలయంలో అందజేయాలన్నారు. లబ్ధిదారుల వాటాకు సంబంధించిన బ్యాంకు ద్వారా తీసిన డీడీలు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అన్నింటిని ఎలా జత చేయాలనే వివరాలపై అవగాహన కల్పించారు.

తెలకపల్లి: మండల కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌లో తెలకపల్లి, కమ్మరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన గొల్లకురుమలకు గొర్రెల పంపిణీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ కొమ్ము మధు, జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర, ఎంపీడీఓ భాస్కర్ పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై..

తాడూరు: మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్తీక్ కుమార్ మాట్లాడారు. మార్పులు, చేర్పులు, వయసు ధ్రువీకరణ పత్రం ఆయా బూత్‌లపై వివరించారు. వనజ, అలీ పాల్గొన్నారు.